క్లుప్తంగా

నేడు మన్యం బంద్

సీతంపేట: జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరుతూ ఆదివారం మన్యం బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు ఏజెన్సీ యువజన సంఘ నాయకుడు లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ నిరుద్యోగ యువతకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని పేర్కొన్నారు. డిమాండ్ల సాధనకు చేపడుతున్న బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉల్లిభద్రలో 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


బూత్ కమిటీ సభ్యులతో మండల కన్వీనర్ గౌరీశంకరరావు

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక పంచాయతీలో బూత్ కమిటీ సభ్యులతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అన్నారు. బూత్ కమిటీ సభ్యులు ప్రతీ ఇంటికి వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ ఫలాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, కమిటీ సభ్యులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కు అందజేస్తున్న విక్రాంత్, రాజశేఖరం, తదితరులు


పాలకొండ: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం శనివారం అందజేశారు. పట్టణంలోని 17వ వార్డుకు చెందిన పైల హర్షితకు రూ. 2 లక్షల చెక్కు అందించారు. ఈమె భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందింది. అలాగే భర్తను కోల్పోయిన మేట్ని కల్పనకు కూడా రూ. 4 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయకుడు, కిల్లారి మోహన్, తుమ్మగంట శంకరరావు, ముడిల సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ ప్రచారసభ పరీక్షలు


హిందీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ప్రచార సభ (హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందీ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. విశారద, భూషణ్ పరీక్షలకు 56 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరైనట్లు కేంద్రం వ్యవస్థాపకులు సంతోష్‌కుమార్ పండా తెలిపారు. మొత్తం 51 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సూపరింటెండెంట్‌గా జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం తోట శంకరరావు, డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఎస్.సత్యనారాయణ వ్యవహరించారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు


మంతినివలస వద్ద రహదారి పక్కన ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీ

కురుపాం: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో శనివారం బెంచీలను ఏర్పాటు చేశారు. యువత, వృద్ధులు, ప్రయాణికుల సౌకర్యార్థం వాటిని ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీ పరిధిలో 40 వరకు బెంచీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నల్లరాయిగూడలో ప్రగతి వెలుగులు..

- టీడీపీ హయాంలో మౌలిక వసతులు కరువు
- జగనన్న పాలనలో అన్ని సౌకర్యాలు
- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- పక్కా రోడ్లతో తీరిన రాకపోకల ఇక్కట్లు


ఏజీ రోడ్డు నుంచి నల్లరాయిగూడకు నిర్మించిన పక్కా సీసీ రోడ్డు

ఇది కదా.. అభివృద్ధి

భామిని:

ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసీ గ్రామంలో నేడు ప్రగతి వెలుగులు వికసిస్తున్నాయి. టీడీపీ నాయకుల నిర్లక్ష్యానికి గురైన ఆ గ్రామం నేడు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రగతిపథంలో దూసుకుపోతోంది. మండలంలోని నల్లరాయిగూడ గ్రామం రూపు రేఖలను జగనన్న ప్రభుత్వం పూర్తి మార్చివేసింది. కోట్లాది రూపాయలతో భవనాలు, అభివృద్ధి పను లు చేపట్టడంతో పాటు పంచాయతీ కేంద్రం నుంచి సమీప గ్రామాలను కలుపుతూ పక్కారోడ్లు వేయడంతో ప్రజల రాకపోకల ఇబ్బందులు తీరాయి. మనబడి నాడు – నేడు పథకంలో భాగంగా గిరిజన పాఠశాలను అభివృద్ధి చేసి మండలంలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దారు. స్కూల్ ఆవరణ పార్క్‌ను తలపించేలా అభివృద్ధి చేశారు.

అభివృద్ధి పనులు..

- రూ.42 లక్షలతో సచివాలయ భవన నిర్మాణం.
- గిరిజనుల ఆరోగ్య రక్షణకు రూ.17.60 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ భవనం ఏర్పాటు.
- రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించడానికి రూ.26.62 లక్షల వ్యయంతో ఆర్‌బీకే భవనం నిర్మిస్తున్నారు.
- ఏజీ రోడ్డు నుంచి నల్లరాయిగూడ వరకు రూ.63 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం
- రూ.1.32 కోట్లతో నల్లరాయిగూడ నుంచి తివ్వాకొండ మీద గల రేగిడి గిరిజన గ్రామం వరకు రెండు కిలోమీటర్ల మేర ఘాట్ రోడ్డు నిర్మాణం.
- ఇసుకగూడ, సన్నాయిగూడ, డోకులగూడలను అనుసంధానం చేస్తూ పక్కా రోడ్లు.
- గిరిజనుల తాగునీటి కష్టాలు తీర్చడానికి రూ.5 లక్షలతో మినీ రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు. ప్రస్తుతం జల్‌జీవన్ పథకంలో భాగంగా రూ.8 లక్షలతో ఇంటింటికి కుళాయిల ఏర్పాటు పనులు చేపడుతున్నారు.
- మనబడి నాడు- నేడు పథకంలో భాగంగా రూ.25.37 లక్షలతో గిరిజన సంక్షేమ శాఖా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి.

రూ.5.58 కోట్ల సంక్షేమ ఫలాలు..

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేరున అందించిన సంక్షేమ పథకాల కింద ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ)లో భాగంగా లబ్ధిదారులకు 4,11,25,295 రూపాయలు అందజేశారు. అలాగే పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) కింద రూ.1,47,40,118 లబ్ధి చేకూరింది.


పార్కులా రూపుదిద్దుకున్న గిరిజన సంక్షేమ పాఠశాల ఆవరణ


ప్రారంభానికి సిద్ధమైన సచివాలయ భవనం


వైద్య సేవలు అందించడానికి సిద్ధమైన వెల్‌నెస్ సెంటర్ భవనం


నల్లరాయిగూడ నుంచి తివ్వాకొండ మీద గల రేగిడికి నిర్మించిన పక్కా ఘాట్ రోడ్డు


గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్


యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్న ఆర్‌బీకే భవనం

రూపురేఖలు మారాయి..



సీఎం జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లరాయిగూడ రూపురేఖలు మార్చారు. చిరకాలంగా ఉన్న సమస్యలను తీర్చారు. కొత్త పంచాయతీ ఏర్పాటుతో నన్ను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ప్రతి గిరిజన కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మహిళలకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేదోడు, అమ్మఒడి పథకాలు అందడంతో ఆర్థిక భరోసా కలిగింది. మహిళలు స్వయం ఉపాధి పొందడంతో జిల్లా అధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నాం.

– బిడ్డికి గౌయింతి, సర్పంచ్, నల్లరాయిగూడ

అభివృద్ధి చెందింది..



గతంలో జీపీఎస్ స్కూల్స్‌కు నిధులు రాక కనీస సౌకర్యాలు ఉండేవి కాదు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు – నేడు పథకంతో పాఠశాల రూపురేఖలు మారాయి. పరిసరాలు ఆహ్లాదకరంగా మార్చుకున్నాం. ఆర్‌ఓ ప్లాంట్‌తో విద్యార్థులకు రక్షిత నీరు అందిస్తున్నాం. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు నిర్మించారు. జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం అందుతోంది. ఇంగ్లిష్ మీడియం కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నాం.

– కె. రవికుమార్, హెచ్‌ఎం, జీడబ్ల్యూఎస్ స్కూల్, నల్లరాయిగూడ

జగనన్నకు రుణపడి ఉన్నాం..



గిరిజనుల కష్టాలు గుర్తించి ప్రత్యేకంగా గ్రామ సచివాలయం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి ఇంటివద్దకే పాలన తీసుకువచ్చారు. రైతుభరోసా కేంద్రం ద్వారా పోడు పంటలకు ఈ క్రాప్ చేసి రైతుభరోసా అందిస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారు. గిరిజన గూడలను అనుసంధానిస్తూ పక్కా రోడ్లు నిర్మించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. సీఎం జగనన్నకు గ్రామస్తులందరం రుణపడి ఉంటాం.

– బిడ్డిక నూకయ్య, సచివాలయ కన్వీనర్, నల్లరాయిగూడ

ఘనంగా నమామి సాయి శత రుద్రీయం


శివునికి అభిషేకం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నమామి సాయి శత రుద్రీయంను శనివారం ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రుద్రీయ యజ్ఞంలో వంద మందికిపైగా రుత్వికులు, సుమారు వెయ్యి మందికి పైగా సాయి భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు పి.సేతాజీనాయుడు మాట్లాడుతూ.. భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం కొతారు సాయి శ్రీహరి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సత్యసాయి సేవా సంస్థలు శత రుద్రీయం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యజ్ఞాలు చేయడం వల్ల ప్రజలకు సుఖశాంతులు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా నగర సంకీర్తన, భజనలు, గోపూజలు, మొక్కలు నాటడం, శివునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా గురజాడ విద్యాసంస్థల అధినేత జి.స్వామినాయుడు దంపతులు, ఉమ్మడి జిల్లాల జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం


దురుబిలిలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కురుపాం: మండలంలోని బియ్యాలవలస పంచాయతీ దురుబిలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై శనివారం సర్వే చేపట్టారు. ఈ గ్రామంలో పంటలన్నీ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్నారు. పంట దిగుబడులు, రైతుల ఆర్థిక పరిస్థితి ఎంతవరకు మెరుగుపడిందని, ప్రకృతి పంటలను ఆహారంగా తీసుకుంటున్న కుటుంబాల ఆరోగ్య పరిస్థితులు, తదితర అంశాలపై ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం పి.షణ్ముఖరాజు ఆరా తీశారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు తరఫున హెల్త్ అండ్ న్యూట్రిషన్ సర్వేలో భాగంగా కిడ్నీ, లివర్, హెచ్‌బీ, బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు చేశారు.

సంక్షేమం కొనసాగాలంటే..
జగనన్న మళ్లీ రావాలి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


శాశ్వత హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ప్రజలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ మోహనరెడ్డినే గెలిపించుకోవాలని శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల శాశ్వత హక్కు పత్రాలను అందించారు. పాలకొండ అర్బన్ పరిధిలో 1341 మందికి.. రూరల్ పరిధిలో 541 మందికి అందించిన ఇళ్ల పట్టాలకు ఇటీవల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులకు భవిష్యత్‌లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం పక్కా రిజిస్ట్రేషన్‌తో పట్టాలు అందజేస్తోందని చెప్పారు. ఏ రాష్ట్రంలోనూ అమలు కాని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయమని జగన్ మోహన్‌రెడ్డి అడుగుతుంటే.. ప్రతిపక్షాలు ఏమి చెప్పి ఓటు అడుగుతాయని ప్రశ్నించారు. గత పాలనకు, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకుని ప్రజలు రానున్న ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ సర్వేశ్వరరావు, తహసీల్దార్ వరహాలు, డీటీ బుచ్చయ్య, ఎంపీపీ బి. భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాశరావు, వాకముడి అనిల్‌కుమార్, వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, తూముల లక్ష్మణరావు, కొంచాడ అరుణ కుమార్, కిల్లారి మోహన్, పల్లా భాను, ఆకుల కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కల నెరవేరింది..



ఇరవై ఐదు సంవత్సరాల సొంతింటి కల ఎట్టకేలకు నెరవేరింది. ఇంటి కోసం ఎన్నిసార్లు నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇంటి పట్టా ఇచ్చి, నిర్మాణానికి రూ. 1.80 లక్షలు మంజూరు చేశారు.

– రజిని, లబ్ధిదారు

రూ.3.50 లక్షల లబ్ధి



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ సంక్షేమ పథకాల ద్వారా 3.50 లక్షల రూపాయల మేర లబ్ధి చేకూరింది. మా కుటుంబం జగనన్నకు రుణపడి ఉంటుంది. ఇంతమంచి గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదు.

– శారద, గొట్టమంగళాపురం, లబ్ధిదారు

సచివాలయ వ్యవస్థ.. నూతన అధ్యాయం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్
- సచివాలయ, ఆర్‌బీకే భవనాలు ప్రారంభం


చిదిమిలో నూతన సచివాలయ భవన శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

వీరఘట్టం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా పల్లెల్లో ప్రజాపాలన తీసుకువచ్చారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని చిదిమి, కంబర, నడిమికెల్ల గ్రామాల్లో నూతన సచివాలయ భవనాలు, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఓ నూతన అధ్యాయమని కొనియాడారు. బాపూజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థతో నెరవేరిందని చెప్పారు. సుమారు 750 పౌరసేవలు సచివాలయాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమపథకాలు అందుతున్నాయన్నారు.

పొత్తులను ప్రజలు నమ్మడం లేదు....

టీడీపీ ఓటమి భయంతోనే దారిన పోయే వారందితో పొత్తులు పెట్టుకుంటోందని ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. ఈ పొత్తులను వచ్చే ఎన్నికల్లో ప్రజలు చిత్తుచేస్తారని జోస్యం చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్నాయన్నారు. పేదోడు గెలవాలంటే టీడీపీ–జనసేన కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, సర్పంచ్‌లు దమలపాటి ఉమామహేశ్వరరావు, సొంట్యేన లక్ష్మి, డోకల సుజాత, నీలం సత్యంనాయుడు, భోగి మణి, వైశ్యరాజు గోవిందరాజు, గాడి సత్యం, గంట వెంకటరమణ, ఆబోతుల సంగంనాయుడు, డోకల శ్రీను, తెర్లి దాలినాయుడు, గుంట్రెడ్డి గౌరీశంకరరావు, దత్తి వెంకటరమణ, సొంట్యేన సింహాచలం, మెరుగుల చంద్రమౌళి, రంభ శ్రీను, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్నకు తోడుగా ఉంటాం..


లివిరిలో మేమూ సిద్ధం అంటూ అభివాదం చేస్తున్న నాయకులు, వలంటీర్లు

భామిని: రానున్న ఎన్నికల్లో జగనన్నకు తోడుగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నాయకులు, బూత్‌కమిటీ సభ్యులు, వలంటీర్లు ప్రకటించారు. మండలంలోని భామిని, బొద్దగూడ, లివిరి సచివాలయాల పరిధిలో శనివారం 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం' కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ సభ్యులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహచలం, జేసీఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు దిశా నిర్దేశం చేశారు. సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు, జిల్లా యూత్ కమిటీ కార్యదర్శి కొండగొర్రి చంటి, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో చిరుజల్లులు

పార్వతీపురం: స్థానిక పట్టణంలో శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, వర్షపు చినుకులు రాలడంతో వేసవి ఉక్కపోత నుంచి జనాలకు కాస్త ఉపశమనం లభించింది. ఇదిలా ఉండగా, ఈ చినుకులు నువ్వు, జీడిమామిడి పంటకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా ఓటు చేయాలి

- సీఐ చంద్రమౌళి


వీరఘట్టం ప్రధాన రహదారిలో కవాతు చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

వీరఘట్టం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటు వేయాలని సీఐ చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు ఎస్సై ఎం.గోవింద్, స్థానిక పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో మండల కేంద్రంలో శనివారం కవాతు నిర్వహించారు. పాల్ల రోడ్డు, రెల్లివీధి, బీసీ కాలనీల్లో పర్యటించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీ నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛయుత వాతావరణంలో వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.మంగరాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శనివారం కవాతు నిర్వహించారు. చినమేరంగి జంక్షన్ నుంచి పెదమేరంగి జంక్షన్ వరకు సుమారు 95 మంది కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకొని ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో చినమేరంగి, జియ్యమ్మవలస, గరుగుబిల్లి ఎస్‌ఐలు చిన్నంనాయుడు, హనీష్, అమ్మన్నరావులు పాల్గొన్నారు.

మిన్నాజోలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ


మిన్నాజోల క్షేత్రంలో భక్తుల తాకిడి

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దు భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న మిన్నాజోల శైవక్షేత్రంలో భక్తుల రద్దీ శనివారం కూడా కొనసాగింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన సిరిగూడ, బెల్లంగూడ గ్రామాలకు చెందిన వ్యాపారులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మిన్నాజోల క్షేత్రంలో త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేసి.. నదీ జలాల మధ్య వెలసిన మీనకేశ్వరుని దర్శించుకున్నారు.